# నటుడు

జి. నరసింహమూర్తి

నటుడు రంగులు పూసుకొని రంగం మీదకొచ్చి ప్రేక్షకుల్ని జయించాలనుకుంటే రచయిత అక్షరాల వెనక దాగి పఠితుల్ని దోచుకోవాలని ప్రయత్నిస్తాడు.

మరి అలా చేయడానికి రచయిత ఎలా తన రచన ప్రారంభిస్తే పాఠకుడు చిక్కడతాడోనని అటు నుంచి యిటూ, యిటు నుంచి అటూ కథని తిప్పుకోవడానికెన్నో ప్రయత్నాలు చేసి కడకేదో మాటతో ముందుకొచ్చేస్తాడు నటుడేదో వేషంతో రంగప్రవేశం చేసినట్టు.

నేను రంగులు పూసుకోని నటుణ్నే కావొచ్చు. కాని నటుడికీ, రచయితకీ పోలికలున్నాయి.

కావొచ్చు. ఇక్కడ పాఠకుడికి కావలసింది రచయిత కాదు. రచయిత నడిపే కథ-లేదా పాత్రలు!

ఆ పాత్రలు రంగప్రవేశం యెలా చెయ్యాలిఅన్నది పాఠకుడికి అనవసరం. రచయితే తల్లకిందులౌతాడు.

ఉన్నదున్నట్టు యే రచయితా రాసి మెప్పించలేడు. క్లమాక్సుకో, కొసమెరుపుకో అక్కడక్కడా మార్చుకోకపోతే పాఠకునకూ, రచయితకూ ఆఖరున యెదముఖం, పెదముఖం అవ్వొచ్చు. రచయిత కథను బరువుగా ఆఖరుచెయ్యాలంటే హాస్యం చిందే మాటల్ని యేరి పారేయాలి. గంభీర్యంగా తయారైపోవాలి. అందుకు తగినట్టు తనలో బరువునూ, బాధనూ పెంచుకోవాలి.

అందుకే రచయిత నటుడు. నటించి రక్తి కట్టించాలి.

* * *

"మన నాటకం గోదాట్లో దింపకు" అన్నాడు శివన్నారాయణ.

నేను నోరెత్తలేదు.

నాటకంఅంటే కళాకారునికే తెలుసు. కళంటే ఏమిటంటే యెందరు సరిగ్గా చెప్పగలరు?

నాటకాన్ని సృష్టించడం పెద్ద కష్టం కాకపోవచ్చు. దానిని స్టేజీమీద పెట్టడమే మహా యజ్ఞం!

రిహార్సిల్స్ కోసం సంపాదించిన

పాత యింటి మూలగదిలో చాలీచాలని రెండు హరికెన్ లైట్ల మధ్య తక్కిన నటుల ముఖాలు సరిగ్గా కనబడకుండా వున్నాయి. అయినా పాత్రకు సరైన మనిషి దొరకలేదన్న అసంతృప్తి డైరెక్టర్ శివన్నారాయణ ముఖంలో స్పష్టంగా కనబడుతోంది.

దేహంమీదా, అందంమీదా, స్త్రీమీదా ఆశలేని మగవాడు మా నాటక సభ్యుల్లో లేడు.

కళాకారుడు అయినా కాకపోయినా నాటకం వెయ్యడానికి ఎగబడ్డాడంటే తప్పనిసరిగా మృదువైన మనసుతో పాటు మొరటుదేరిన కోరికలున్న వ్యక్తే అని అర్థమైపోతోంది.

"నాటకంలో స్త్రీ పాత్రఅయినా ఎత్తే య్యొచ్చుగాని పచ్చోడు పాత్రని తప్పించడానికి వీల్లేదు" అన్నాడు శివన్నారాయణ.

అమాంతంగా తమ తమ భార్యలమీద ఎవరో మానభంగం చేస్తున్నట్టు అమాంతంగా సభ్యుల ఛాతీలు లేచిపడ్డాయి. పెట్లో దస్తావేజులు లాక్కుపోతున్నట్టు కంగారుపడిపోతున్నారు. ఎందుకింత ఆవేశం? - ఆవేశం కాదు. అదది నాటకానికి వేషం కట్టడానికి రాకుండా శివన్నారాయణ యెక్కడ చేస్తాడోనని అందరికీ అతనిమీద కోపం రేగింది.

"అయితే మనమేం చెయ్యగలం?. సూర్యం విశాఖపట్టణంలో ఉన్నాడు." అన్నాను నేను.

"అతణ్ణి తీసుకురావాలి" అన్నాడు శివన్నారాయణ.

"ఎలా వీలవుతాది?" అతని భార్యకు కేన్సర్ హాస్పిటల్లో ఉంది కనక అతను కూడా అక్కడుండాలిగా" అన్నాను.

"పరిషత్తుపోటీలు యివి మనం వెనక్కి తగ్గామంటే మనకి ప్రైజురాదనే వెనక్కి తగ్గామని అంతా అనుకుంటారు. మన సమాఖ్య పేరు దెబ్బ తింటాది" అన్నాడు మళ్ళీ.

నాటకాల పిచ్చి అసలుపిచ్చి కన్నా పెద్దది. అవతల భార్యకువంట్లో బాగోలేక సూర్యం వైజాగ్‌లో వుంటే అతణ్ని నాటకం ఆడడానికి రమ్మనమని యెలా తీసుకురావడం.

ఆఫీసులో కూడాపోర్షన్లు కంఠస్థం చేసి చేసి రిహార్సిల్స్‌కి అటెండయిన వాళ్ళున్నారు అందులో కొందరు.

చెయ్యాల్సిన ముఖ్యమైన పనులన్నీ వదులుకొని నాటకమే జీవితం అనుకొని చేరినవారు కొందరున్నారు అందులో.

నెలకు నాలుగొందలిచ్చే ఉద్యోగం అంత కరెక్టుగా నెరవేర్చని ప్రబుద్ధులు కొందరు నాటకం అనేసరికిచాలా పంక్చ్యువల్ గా ఉండేవారు.కొందరు.

"సూర్యం పోర్షన్ రాఘవ కిచ్చి రాఘవ పోర్షన్‌కిఎవర్నయినా వేద్దాం"అని రత్నం సలహా యిచ్చాడుబెరుగ్గానే.

"వీల్లేదు" అన్నాడు శివన్నారాయణ చురుగ్గా.

"సూర్యమే అందుకు సూటవుతాడు. సూర్యం వెయ్యకపోతే అసలు నాటకమే పాడయిపోతాది" అన్నాడుశివన్నారాయణ

అయితేయేంచెయ్యడం?— అంతా ఆలోచించాం. వైజాగ్‌వెళ్ళి సూర్యాన్ని తీసుకురావడమా? లేకనాటకాన్ని మానుకోవడమా? లేడిరోల్ వెయ్యాల్సినావిడికి

అడ్వాన్సుగా మూడొందలు కూడా యిచ్చే సాంచందాలుపోగుచేసుకుని.

లేడిరోల్ వెయ్యబోతున్న సూర్య కుమారి బిజీరంగస్థల నటి- ఆవిడున్నా నాటకానికి బహుమతి వస్తాదో రాదో తర్వాత మాటగాని చాలాఅందగత్తె.

రెండ్రోజులు తర్వాతసూర్యకుమారి రిహార్సిల్స్ కి పట్టణంనుంచిరాతోంది. ఆమె వచ్చేరోజున మాత్రం యెవ్వరూ ఆబ్సెంట్ అవ్వరు.కానిసూర్యం ఉండక పోతే అసలే తెంపోలేకుండా పోతోందని తక్కిన యాక్టర్లకు తెలుసు.

సూర్యం నాటకంలోముఖ్యపాత్రధారి. అసలు కథేమంటే, హీరో పిచ్చోడు. భార్య ఉద్యోగం చేస్తూ పిచ్చి భర్తని సాకుతూఉంటుంది. కాని పిచ్చోడయిన భర్తముందే పరాయిమగాళ్ళు ఆమె మీద రాసుకుని.పూసుకుంటూ తిరుగుతుంటారు. ఎలాగైనా ఆమెను అనుభవించాలన్న తపనతో సానుభూతిమాపుతున్న పరోప కారుల్లా నటిస్తూ ఆమెను లొంగదీసుకో డానికితిరుగుతూవుంటారు ఆమె మాత్రం అందరినీ దూరంగాతోలుతూ, చీదరించు కుంటాది.పిచ్చోడు బతికున్నంతకాలమూ తమ పన్నాగం సాగదనికొందరు కలిసి పిచ్చోడిచేత తాగించి ఆ మత్తులో అతణ్ణి చంపాలనిప్రయత్నించబోతూండగా ఆమె వాళ్ళతో కలబడతాది. ఆ ప్రయత్నంలో అనుకోకుండాపిచ్చోడుఒకడిగొంతు పిసికి చంపుతాడు. కాని ఆహత్యఆమె మీద వేసుకుంటుంది భర్త మీద ప్రేమకొద్దీ

కాని యిక్కడో ప్రశ్నమిగిలిపోతుంది. అదేమంటే పిచ్చోడు పిచ్చి పోయిందా లేదానని.

అది సినిమా కథకాదుకాబట్టి ఆచావుకి

| |
|---|
| **పాఠకులకో మనవి** |
| కేవలం "కథ" కోసమే చదవడం మానేసి రచనలో జీవాన్ని, శిల్పాన్ని, నిజాన్ని తెలుసుకోవడం మనస్సుకే మంచిదని మా అనుభవం. |
| —సం॥ |

అతను మామూలు మనిషి అయిపోడు. హత్య చేసినా రోడ్లంట తిరుగుతూనే ఉంటాడు ముందుఈ పిచ్చోడంటే ఎవరికీ భయం వుండదుగాని యిప్పుడు మాత్రం పిచ్చోడంటే అందరికీ భయం ఆ భయంవల్ల అణకువ ఆదరణ.

కానిఅదంతాఆ పిచ్చివాడికే తెలుసు.

కానియిక్కడ హీరోయిన్ జైలుకెళ్ళి తనపవిత్రతనుకోల్పోయి పతితగా బయ టకు రావొచ్చుననే భావన రచయిత కల్పించితప్పుకుపోతాడు.

థీమ్ పకడ్బందిగానే ఉంది. అది నప్పించడం కూడా అలాగే ఉండకపోతే రచయిత తిట్టుకుంటాడు. తన సందేశం అందలేదనిబాధపడతాడు.

ఇక్కడఎవరిబాధ వాళ్ళది.

ఒక ప్రక్క డైరెక్టరు.మరో ప్రక్క యాక్టర్లు. రచయిత. సమాఖ్యపేరు నటులుగా పేరు తెచ్చుకోవడానికి ఆశించే వారి కీర్తి కాంక్ష.

ఏది ఏమైనా సూర్యాన్ని రప్పించ డానికే నిర్ణయమైంది. సముద్రంలో నీరు తోడడానికే నిర్ణయించుకొన్నట్టు.

అనామిక

వైజాగ్ మనిషిని పంపాం. అతను భార్యని వదిలేఁరాదనుకున్నాంగానిఅతను వచ్చేశాడు. సూర్యం కూడా కళాకారుడు కనుక ఆ మాత్రంపిచ్చిఅతనికుండొచ్చు ననుకున్నాను. ఆతను భార్యనైనాలెక్క చేయకుండా రావడమూ, రిహార్సిల్స్‌లో పాల్గొనడమూజరిగిపోయాయి.

"మంచి పోర్షన్ కనుక తప్పకుండా యేదో బహుమతి వస్తాదన్న కుళ్ళు బుద్ధి తోనే వచ్చేశాడు. జబ్బులో ఉన్న పెళ్లాన్ని వదిలేసి" అన్నాడు మాలో ఓ యాక్టరు.

యాక్టర్లలో యాక్టర్లకి పోలిటిక్స్ మామూలే.

అదే పోర్షన్ యిచ్చి యాక్టు చెయ్యమంటే చెయ్యలేడుగాని ఆ యాక్టరు లేని సమయంలో ఫీలింగ్స్ బావుండ లేదనీ, అస్తమానమూ చెయ్యి అలాగే పెడుతున్నాడనీ, డైలాగ్స్ తెలంగాణా స్టయిల్లో ఉన్నాయని వంకలు పెట్టడం మామూలే.

నాటక పోటీల తారీఖు దగ్గర పడింది.

ఈలోగా సూర్యం మరోసారి వైజాగువెళ్ళి భార్యను చూసివస్తానన్నా యెక్కడ తిరిగిరాడనో అతణ్ణి వెళ్ళనీయకుండా అదీ యిదీ చెప్పి ఆపుచేశాం మొత్తంమీద.

"చూడండి భాయ్. ఈ పిచ్చివాడి వేషం ఇంకెవరికైనా యిచ్చి నాకో చిన్న రోల్ యివ్వండి. కాస్త రిలీఫ్‌గా ఉంటాది నాకు" అని అర్థించాడు సూర్యం ఓ రోజున.

శివన్నారాయణ అది వినిపించుకోలేదు.

"నువ్వు తప్ప ఆ పోర్షన్‌కి సరిపోయే మనుషులు మనలోలేరు" అంటూ అతణ్ణి ప్రోత్సహించాను

సూర్యం కడకి ఏమీ అనలేకపోయాడు.

పరిషత్తుకి వెళ్ళే రోజున ఓటెలిగ్రాం వచ్చింది సూర్యానికి. అప్పటికి సూర్యం లేడు అక్కడ. విప్పి చదివాం.

భార్య మరణించినట్టు వార్త।

శివన్నారాయణ కదిలిపోయాడు.

ఇన్ని నెలలుగా చేస్తున్న కృషి బూడిద పాలవ్వడం యిష్టంలేదు. ఈ సంగతి తక్కిన వారిక్కూడా తెలిసి పోయింది.

"మీరండి సూర్యానికి ఈ సంగతి తెలియనీయకండి నాటకం పూర్తయ్యే వరకూ" అన్నాడు శివన్నారాయణ చాలా ట్రిక్కుగా.

"అదేం మంచిదికాదు. తర్వాత అతను బాధపడతాడు" అన్నాను ఖచ్చితంగా.


"బాధేంటి బాధ। — మేం ఇంత కాలంనుంచీ దీనిని పట్టుకుని పాకులాడితే కడకు వెయ్యకుండా పోతే యేంగాను" అన్నాడు అందులో ఒకతను.

తక్కిన వాళ్లుకూడా అతణ్ణే సపోర్టు చేశారు.

నా కళ్ళు చెమిర్చినంత పనయ్యింది.

వాళ్ళందరిలోనూ పరిషత్తులో నాటకం ఆడామన్న పేరు తెచ్చుకోవాలనీ, సూర్యకుమారితో స్టేజిమీద నటించామన్న ఆనందంకోసమూ అంత పట్టుదలగా ఉన్నారని గ్రహించాను.

పరిషత్తులో నాటకం ఆడాలి. కాని




సూర్యం భార్య చనిపోయిందని తెలియకుండా కూడా నాటకం ఆడాలి.

అసలు నాటకం కంటే సూర్యం భార్య మరణవార్త తెలియనీయకుండా బాగా నటించారు అంతా.

పరిషత్తులో మా నాటకానికి ఉత్తమ ప్రదర్శనగా బహుమతి! మేమంతా వొకళ్ళనొకళ్ళం కౌగిలించుకున్నాం. అంతా ఎగిరి గంతేశారు.

అంతేకాదు. సూర్యం ఉత్తమనటుడుగా ఎన్నికైనాడు

ఆ ఆనందం అతనికి కాస్సేపయినా దక్కనీయని దైన్యస్థితిని వెనువెంటనే పట్టుపట్టి కల్పించారు కొందరు.

అసలు సంగతి చెప్పేశారు.

భార్య శవాన్ని చూసుకోవడానికి సూర్యం వెళ్ళిపోయాడు.

సూర్యం వెళ్ళేసరికి ఆమె శవాన్ని ఉంచుతారో లేదో!

అతని గొడవ ఎవరికి అక్కర్లేకుండా పోయింది. కాని మా సమాఖ్యకి మంచి పేరు ప్రతిష్ఠలు రావాలని విలేఖర్ల ద్వారా అన్ని తెలుగు పత్రికల్లోను ఫోటోలు వేయించుకున్నాం. దాంతో మరికొన్ని చోట్ల వేయడానికి బుక్కింగ్ అయ్యాం.

సూర్యం అంత త్వరగా మళ్ళీ స్టేజ్ ఎక్కే స్థితిలో లేకపోయినా మేమంతా బలవంతంగా మళ్ళీ స్టేజ్ యెక్కించాం. అతను ముందుకంటే బాగా నటించాడన్నారు అంతా.

అతని హృదయాంతరాల్లో ఉన్న వేదన కొంత ఆ పాత్రకు బలం చేకూర్చిందన్న నమ్మకం నాకు.

జిల్లా లెవిల్ పోటీల్లో పాల్గొన్నాం.

అక్కడ కూడా సూర్యానికి ఉత్తమ నటుడిగా బహుమతి వొచ్చింది. తర్వాత మరికొన్ని చిన్న చిన్న పోటీల్లో పాల్గొన్నాం.

మొత్తంమీద అదే నాటకాన్ని పట్టుకొని ఖర్గపూర్ వరకూ వెళ్ళాం. అన్నిచోట్లా సూర్యానికి బహుమతులు వచ్చాయి. అతనిలో నటుడు బయట పడ్డాడు. పెద్ద పెద్ద సమాజాలు సహితం అతణ్ణి గుర్తించాయి. ప్రత్యేకంగా సూర్యాన్ని తెలుగు దేశానికి పరిచయం చేశారు కొందరు విలేఖర్లు, ఈ దెబ్బతో సూర్యానికి సిన్నిమా ఛాన్సు దొరుకుతుందనీ, మా సమాజం నుంచి ఓ నటుడు సినీమా రంగానికెళ్ళాడనీ చెప్పుకుంటా రనుకున్నాం

నిజం చెప్పాలంటే సూర్యం గొప్ప నటుడు. చిన్నతనంనుంచీ అనేక నాటకాలాడాడు. రేయనక పగలనక సమాజాల చుట్టూ తిరుగుతూ తన శక్తినంతా ధార పోసుకున్నవాడు. ఎప్పుడైనా ఎక్కడైనా ఏ నటుడైనా కారణాంతరాలవల్ల రాక పోతే సూర్యాన్ని నిముషాలమీద ట్రైనింగిచ్చి నాటకం ఆడించి రక్తికట్టించిన సంఘటన లెన్నో ఉన్నాయి.

ఇంతలో నాకు ఉద్యోగం వచ్చింది. ఎక్కడికో హిందూస్తాన్‌కి వెళ్ళి పోయాను. నాలాగే మరి కొందరికి ఉద్యోరీగత్యా ట్రాన్స్‌ఫర్ రీత్యా యెక్కడెక్కడికో వెళ్ళిపోయారు.

శివన్నారాయణకి మాత్రం మంచి స్టేటస్ ఉన్న ఉద్యోగం ఉండనేఉంది, అతను ఉన్నచోట ఉండిపోయాడు.

యాన్యువల్ సెలవు లీవ్‌మీద ఇక్కడకొచ్చి మిత్రుల్ని కలిశాను. ముఖ్యంగా సూర్యం కోసం వెళ్తే అతను తాలూ ఆఫీసు ఉద్యోగం మానివేశాడని తెలిసింది.

తర్వాత సూర్యం నాకు టౌన్లో కనిపించాడు. అతనిలో చాలా మార్పు వచ్చింది. టీ స్టాల్‌కి తీసుకెళ్ళాను, ఫలహారం తింటూ యేదో ఆలోచిస్తున్నట్లు కనిపించాడు. నాటకాల గురించి అడిగాను. వాటికూ్కడా సరిగ్గా సమాధానం చెప్ప లేదు.

అతని గురించి తెలుసుకుంటే, మొదట్లో కొన్ని నాటకాల్లో బుక్కయ్యాడనీ, తర్వాత తర్వాత అతణ్ణి ఎవరూ తీసుకోలేదనీ అలాగే పొద్దున్నుంచి సాయంత్రం వరకు అక్కడక్కడా తిరుగుతుంటాడనీ తెలిసింది.

నేను మళ్ళి డ్యూటీకెళ్ళి పోయిన తర్వాత అతని గురించి ఆలోచించడానికి అంతగా కుదర్లేదు.

తిరిగి రెండు సంవత్సరాల తర్వాత మళ్ళీ ఇంటికి తిరిగొచ్చాను.

శివన్నారాయణకి ప్రమోషన్ వచ్చి ఇంకా పైకెళ్ళాడు. అప్పట్లా నాటకాల మీద యెక్కువసేపు చర్చలు చేయడానికి సుముఖత చూపలేదు.

అయినా "మన సూర్యం ఎక్కడున్నాడు?" అని అడిగాను

"ఆ, ఉన్నాడ్లే", అనేసి మరో టాపిక్ మార్చేశాడు.

ఇతర్లద్వారా సూర్యం గురించి తెలుసుకుని ఆశ్చర్యపోయాను. అతణ్ణి కడకు కలుసుకున్నాను.

గడ్డంబాగా పెరిగిపోయింది. బట్టలు చిరిగిపోయాయి బాగా చిక్కిపోయాడు. మనిషంతా బాగా మట్టి గొట్టుకుపోయి దీనంగా ఉన్నాడు ఎక్కడ పడ్డాడో యేమో నొసటికి తగిలిన దెబ్బ సెప్టిక్కయ్యి చీము కారుతోంది.

రోడ్డుమీద అతణ్ణి పట్టుకుని "సూర్యం!" అన్నాను

నా వంక అదోలా చూసి "యెవరు సూర్యం?- హుం- సూర్యం చంద్రంతో కలిసిపోయాడు" అనేసి నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు. ఆ నవ్వు మామూలు నవ్వు మాత్రంకాదు.

అయితే సూర్యం పిచ్చోడు!

పిచ్చోడిగా నటించేటప్పుడు మహానటుడంటూ ఆకాశానికెత్తేసిన ఈ ప్రజలు నిజంగా అతను పిచ్చివాడయ్యి వీధులంట తిరుగుతుంటే........

గబగబా శివన్నారాయణ దగ్గరకు వెళ్ళి "మన సూర్యం పిచ్చోడయి పోయాడు. మనమంతా అతణ్ణి రక్షించుకోవాలి" అన్నాను ఆవేశంగా, బాధగా.

అతను సిగరెట్ పొగవదుల్తూ యేమీ పట్టనట్టు తేలిగ్గా నవ్వేశాడు.

"శివన్నారాయణా!" నాలో కోపం రగులుతోంది.

"చూడు మిష్టర్! సూర్యాన్ని అప్పుడు నటించమన్నాం. ఇప్పుడు ఆ నటన మనకనవసరం. నువ్వో రచయితవి కనుక కావాలనుకుంటే అతని మీద ఓ కథో, నవలో రాసుకో".

అయితే ఆ మహానటుడు అంటే యేమిటో చెప్పుకోవాలంటే, నాలో రచయిత నటించాలంటే ఈ నటనకు అంతం యెక్కడ?

## బందరులో 'స్వాతివాన'

ఆంధ్రదేశంలో కళలకు కళాకారులకు కొదువ లేదు. కాని ప్రోత్సాహము, అవకాశము తక్కువగా ఉన్నాయి. ఉత్సాహం ఉన్నా ప్రోత్సాహం లేని ఉత్తమ రంగస్థల నటుల్లో శ్రీ ఎ. సత్యనారాయణమూర్తి ఒకరు. ఈ మధ్య బందరు కలెక్టర్ ఆఫీసులో ప్రదర్శించిన



"స్వాతివాన" నాటికలోనిది పై చిత్రం. అందులో సత్యనారాయణతోపాటు కనిపిస్తున్న ఆమె శ్రీమతి సత్యశ్రీ.